

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | ఆదివారం 22 నవంబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 58 | పేజీలు : 04, వెల రూ.2

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి: రామ్మోహన్ నాయుడు



కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు

భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి

సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి

అమరావతి : కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని మిగతా..2లో

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందన్న కేటీఆర్

తెలంగాణలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గాయని విమర్శ

ఆర్బీఐ నివేదిక ప్రకారం పంచాయతీ

సగటు వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని వెల్లడి

హైదరాబాద్: కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో సాగిన తెలంగాణ గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గిపోయాయని పేర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ మిగతా..2లో

నేటి సాయంత్రం 5 గంటలకు భారీ ప్రకటన ఉంటుంది.. అదేంటో చెప్పగలరా?



- ఏపీలో ఏర్పాటైన ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ తయారీ ప్లాంట్
- కేవలం 12 నెలల రికార్డు సమయంలోనే ప్లాంట్ నిర్మాణం పూర్తి
- 10 ప్రొడక్షన్ లైన్లతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు
- కంపెనీ పేరు లొకేషన్ వివరాలు సాయంత్రం వెల్లడించనున్న మంత్రి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో సరికొత్త రికార్డు నమోదైంది.

ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే
ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది

- కార్యకర్తే అధినేత, పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు.
- స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.



స్థానిక ఎన్నికల్లో కూటమిని గెలిపించిన ప్రజలందరికీ సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పరిషత్ ఎన్నికల్లో ప్రజలు అద్భుత ఫలితాలు ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల పాలనకు ప్రజలిచ్చిన తీర్పుగా దీనిని భావిస్తున్నామన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. కొత్తవారికి అవకాశం : కార్యకర్తే అధినేత, వారే పార్టీకి అసలైన బలమని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా గెలుపే లక్ష్యంగా పనిచేశారని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మిగతా..2లో

వైఎస్ కుటుంబంలో ముదిరిన ఆస్తుల వివాదం
యలహంక ప్యాలెస్‌పై కోర్టుకెళ్లిన జగన్



- జగన్, ఆయన సోదరి షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం మరింత ముదిరింది.
- బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లోకి షర్మిల రాకుండా స్టే ఇవ్వాలని జగన్ కోర్టుకెక్కారు.

జగన్, షర్మిల మధ్య యలహంక ప్యాలెస్ వివాదం

అమరావతి : వైఎస్ కుటుంబంలో ఆస్తుల వివాదం మరో మలుపు తిరిగింది. బెంగళూరులోని అత్యంత విలాసవంతమైన యలహంక ప్యాలెస్ విషయంలో అన్న, చెల్లెలు అయిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, అతని సోదరి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. తన కుమార్తె అంజిలి మిగతా..2లో

అధికారంలోకి వచ్చిన తర్వాత నేరగాళ్ల అంతం!'
కొత్త వంతెనకు నీతీశ్ పేరు పెట్టిన మోదీ

కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు 'గరీబీ హఠావో' అని ఇచ్చిన నినాదాన్ని, తాము కేవలం 12 చేసి చూపించామని మోదీ అన్నారు.



ఢిల్లి: బిహార్ లో ఎన్‌డీఏ అధికారంలోకి రాకముందు కేవలం కుంభకోణాల గురించే చర్చ జరిగేదని, కానీ నేడు, పెట్టుబడులు, అభివృద్ధి, నేరస్థులపై తీసుకుంటున్న కఠిన చర్యల గురించి చర్చించుకుంటున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల పాటు 'గరీబీ హఠావో' అని ఇచ్చిన నినాదాన్ని, తాము కేవలం 12 ఏళ్లలోనే చేసి చూపించామని అన్నారు. సుమారు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురాగలిగామని తెలిపారు. శనివారం, బిహార్ మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గౌరవార్థం ప్రారంభించిన ఆధునిక వంతెనకు 'నీతీశ్ సేతు' అని నామకరణం చేశారు. అనంతరం, వైశాలిలో ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. "దర్గా, బిదుపుర్‌లను కలుపుతూ గంగా నదిపై నిర్మించిన ఆరు లేన్ల కేబుల్ వంతెనను జాతికి అంకితం చేశాం. ఈ వంతెన పట్నా, వైశాలి మధ్య ప్రయాణ దూరాన్ని, ప్రజల కష్టాలను తగ్గిస్తుంది. ఇకపై పండ్లు, కూరగాయలు, పాలు, పాల ఉత్పత్తులను మార్కెట్లకు రవాణా చేయడం సులభతరం అవుతుంది. యువతకు విద్యా, వృద్ధులకు వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడానికి ఇది ఎంతో దోహదపడుతుంది." 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీబిహార్‌లో గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ఎన్ డీఏ పాలనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. గత మూడు దశాబ్దాలుగా బిహార్ అభివృద్ధి పథంలో మిగతా..2లో

ఉమామహేశ్వరుల అంతరార్థం అదే.. రాహుల్, ప్రియాంకలకు హిందూ గురువు హితబోధ



- రాహుల్, ప్రియాంక గాంధీలకు స్వామి పరమాత్మానంద బహిరంగ లేఖ
- శివపార్వతుల చిత్రానికి ఉన్న తాత్విక అంతరార్థంపై విశ్లేషణ
- పార్వతీదేవి రూపం వెనుక ఉపనిషత్తుల జ్ఞానం దాగి ఉందని వెల్లడి
- శివుడు శక్తిమంతుడైతే, పార్వతీదేవి సృష్టి శక్తని వివరణ
- బీజేపీ, ఆరెస్సెస్‌లను విమర్శిస్తూ రాహుల్ పెట్టిన పోస్ట్‌కు కౌంటర్

కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు ఎవరూ మిగల్లేదు

ఇటీవల లష్కరే తోయిబా గ్రూప్ లోని సభ్యుడిని భద్రతా దళాలు మట్టుబెట్టిన నేపథ్యంలో, కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు ఎవరూ మిగలలేదని అమిత్ షా పేర్కొన్నారు.



ఢిల్లి : కశ్మీర్ లోయలో ఉగ్రవాదులు ఎవరూ మిగలలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఇటీవల పుల్వామాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాతో సంబంధం ఉన్న చివరి క్రియాశీల కశ్మీరీ ఉగ్రవాదిని పోలీసులు హతమార్చారని చెప్పారు. శనివారం, అరుణాచల్ ప్రదేశ్ లోని బందర్‌దేవాలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్ పోలీసులకు 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్'ను ప్రదానం చేశారు. "అంతర్గత భద్రతా సవాళ్లు, తిరుగుబాటు, వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిరంతరం పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కోవడంలో అరుణాచల్ ప్రదేశ్ పోలీసులు పనితీరు అద్భుతం. ఈ అవార్డు అందుకున్న తర్వాత, అరుణాచల్ ప్రదేశ్ పోలీసులు మరింత శక్తి, ఉత్సాహంతో ముందుకు సాగుతారని విశ్వసిస్తున్నా. ఈశాన్య ప్రాంతానికి మోదీ ప్రభుత్వం ఏమి చేసిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అడిగిన ప్రతీసారి నాకు పెదవులపై చిరునవ్వు రాక మానదు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈశాన్య ప్రాంతాన్ని స్వర్ణాక్షరాలతో లిఖించారు. మోదీ నాయకత్వంలో అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధికి ఒక కొత్త శకం ప్రారంభమైంది."

ఆ సమయంలో తీవ్రవాదం పరాకాష్టకు చేరుకుంది!

1990లో కశ్మీర్‌లో ఉగ్రవాదం విజృంభిస్తున్న సమయంలో, భారత్ కశ్మీర్‌ను మిగతా..2లో

కొత్తగూడెం వర్శిటీని ప్రపంచంలోనే టాప్-5లో నిలుపుతాం



- దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్శిటీ అయిన కొత్తగూడెం యూనివర్శిటీని..
- ప్రపంచంలోనే టాప్ ఫైవ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీల్లో ఒకటిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.
- కొత్తగూడెం మైనింగ్ కాలేజ్ స్వర్ణోత్సవాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21: కొత్తగూడెం మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు
అసదుద్దీన్‌పై తొలిసారి రేవంత్ ఫైర్

- మోదీ, షా, ఒవైసీ కలిసి మత రాజకీయాలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి
- దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేసి గెలవాలని అమిత్ షాకు సవాల్
- తెలంగాణలో బీజేపీకి బలం లేదన్న రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే అసలు ప్రత్యర్థని స్పష్టీకరణ
- లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది ప్రాధాన్యం తగ్గుతుందని ఆందోళన



హైదరాబాద్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఒవైసీ కూడా మత రాజకీయాలు చేస్తూ పరస్పరం రాజకీయ లబ్ధి పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురి రాజకీయ వైరుధ్యం కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని పేర్కొన్నారు. మోదీ, అమిత్ షా ఒకవైపు హిందువులను, మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ మతపరమైన చీలిక ద్వారా మూడు పార్టీలూ ప్రయోజనం పొందుతున్నాయని రేవంత్ విశ్లేషించారు. 70 ఏళ్లుగా మిగతా..2లో

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు.. రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన



- పార్టీలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైందంటూ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య
- ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోందని వెల్లడి
- పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.

మొదటి పేజి తరువాయి

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి: రామ్మోహన్ నాయుడు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు అసదుద్దీన్‌పై తొలిసారి రేవంత్ ఫైర్

కాంగ్రెస్ మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు చేసిందన్న బీజేపీ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తమ పార్టీ మతం, కులంతో సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నేత ఆజం ఖాన్ చేసిన 'హైదరాబాదీ బిర్యానీ' వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఒవైసీ రాజకీయాలు ఒక ప్రాంతానికే పరిమితమని పరోక్షంగా ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. "నిజంగా ధైర్యం ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలి" అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పైనా రేవంత్ తన విమర్శల దాడిని కొనసాగించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నేతగా అభివర్ణించారు. అదే సమయంలో, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు.. రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన

పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత నేరగాళ్ల అంతం!' కొత్త వంతెనకు నీతీశ్ పేరు పెట్టిన మోదీ

ముందుకు సాగుతోందని, నీతీశ్ కుమార్ అందించిన సుపరిపాలనను ప్రస్తుత ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఆయన బృందం కొనసాగిస్తున్నారని చెప్పారు. అలాగే దివంగత నేత రామ్ విలాస్ పాశ్వాన్ కలలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. తమ పాలనలో ఎంతో మందికి పేదరికం నుంచి విముక్తి లభించిందని మోదీ పేర్కొన్నారు. లక్షలాది మంది పేదల జీవితాన్ని సులభతరం చేయడానికి, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చినందువల్లే, నేడు పేదరికంపై దేశం విజయం సాధిస్తోందని చెప్పారు. తమ పాలనలో దాదాపు 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు, లక్షలాది కుటుంబాలకు శాశ్వత గృహాలు అందించి, వారిలో ఒక భద్రతా భావాన్ని కల్పించామని పేర్కొన్నారు. ఉచిత వైద్య చికిత్స హామీ వల్ల సామాన్యులకు వైద్య ఖర్చుల భారం తగ్గి ఎంతో ఉపశమనం లభించిందన్నారు.

100 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

పట్టణ రవాణాను మరింత సౌకర్యవంతంగా చేయడానికి బిహార్‌లోని వైశాలిలో 100 ఎలక్ట్రిక్ బస్సులను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ ప్రజా రవాణాను బలోపేతం చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం, రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ అనుకూల రవాణాను ప్రోత్సహించడం లక్ష్యంగా 100 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు. మరోవైపు, దశాబ్దాలుగా ఉన్న మౌలిక సదుపాయాల డిమాండ్ నెరవేరడాన్ని కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ కూడా ప్రశంసించారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకత్వమే కారణమని కొనియాడారు. వైశాలి పర్యటన సందర్భంగా రోడ్డు అనుసంధానం, ఇంధనం, పట్టణ మౌలిక సదుపాయాలు, నీటి వనరులు, విద్య, ఆరోగ్య సంరక్షణ, రవాణా వంటి కీలక రంగాల్లో సుమారు రూ. 34,470 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

మోదీపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉంది: సీఎం సామ్రాట్ చౌదరి

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో మోదీపై చేసిన దూషణలు ఏవైనప్పటికీ, ఆయన నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి స్పష్టం చేశారు. మోదీ చేతుల మీదుగా 'నీతీశ్ సేతు' ప్రారంభోత్సవం జరగడాన్ని ఒక ముఖ్య మైలురాయిగా ఆయన అభివర్ణించారు. మోదీ మార్గదర్శకత్వంలో 2037 నాటికి 'సమృద్ధిగల బీహార్'ను, 2047 నాటికి 'వికసిత్ భారత్ 'ను నిర్మించే దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని చెప్పారు.

ఉమామహేశ్వరుల అంతరార్థం అదే.. రాహుల్, ప్రియాంకలకు హిందూ గురువు హితబోధ

ఢిల్లి: శివపార్వతుల చిత్రానికి గల లోతైన తాత్విక అంతరార్థాన్ని అర్థం చేసుకోవాలని సూచిస్తూ హిందూ ధర్మ ఆచార్య సభ ప్రధాన కార్యదర్శి స్వామి పరమాత్మానంద సరస్వతి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు బహిరంగ లేఖ రాశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శివపార్వతుల చిత్రానికి సంబంధించి ఆయన ఈ వివరణ ఇచ్చారు. పరమశివుడి ఒడిలో పార్వతీదేవి కూర్చున్న సంప్రదాయ చిత్రణ కేవలం ఒక సాధారణ దృశ్యం కాదని, దాని వెనుక ఉపనిషత్తులు, శాస్త్రాలు బోధించిన పరమోన్నత జ్ఞానం దాగి ఉందని పేర్కొన్నారు. తాను చూసిన ఆ చిత్రం ద్వారా రాహుల్ ఏం చెప్పాలనుకున్నారో తనకు తెలియదని, అయితే సనాతన ధర్మంలోని అంతరార్థాన్ని తెలియజేయడానికే ఈ లేఖ రాస్తున్నానని స్వామి పరమాత్మానంద చెప్పారు. నిరాకారమైన, నిర్గుణమైన బ్రహ్మమే సృష్టి, స్థితి, లయకారకమైన శక్తులను మేల్కొలిపినప్పుడు ఈశ్వరుడిగా (శివుడిగా) మారుతుందని వివరించారు. శివుడు శక్తిమంతుడైతే, పార్వతీదేవి సృష్టికి మూలమైన 'శక్తి' లేదా 'మాయ' అని తెలిపారు. శక్తిమంతుడైన శివుడిని విడిచి శక్తికి స్వతంత్ర అస్తిత్వం ఉండదని, ఉమామహేశ్వరుల రూపం లేదా అర్ధనారీశ్వర రూపం ఈ తత్వాన్నే లోకానికి తెలియజేస్తాయని స్పష్టం చేశారు. సనాతన ధర్మంలోని పవిత్ర చిత్రాలను బాహ్య దృష్టితో కాకుండా, అవి బోధించే అంతర్గత సత్యాన్ని గురు-శిష్య పరంపర ద్వారానే గ్రహించగలమని ఆయన హితవు పలికారు. ఇటీవల సోనియా గాంధీ, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీల దాంపత్యంపై జరిగిన రాజకీయ చర్చల నేపథ్యంలో రాహుల్ గాంధీ ఈ చిత్రాన్ని పోస్ట్ చేశారు. భయం, కోపం, ద్వేషం ఉన్నవారు ప్రేమను అనుభవించలేరంటూ బీజేపీ, ఆరెస్సెస్‌లను విమర్శిస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా ఆ ఫోటోను పంచుకున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో స్వామి పరమాత్మానంద రాసిన ఈ తాత్విక లేఖ ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు



కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ.16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ.6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు. ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

నేటి సాయంత్రం 5 గంటలకు భారీ ప్రకటన ఉంటుంది.. అదేంటో చెప్పగలరా?

మొదటి పేజి తరువాయి



రాష్ట్రంలో ఒక భారీ ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేసినట్లు వెల్లడించిన రాష్ట్రమంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో నేడు సాయంత్రం 5 గంటలకు ఒక భారీ ప్రకటన చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద పానీయాల (బెవరేజ్) తయారీ ప్లాంట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా నెలకొల్పినట్లు ఆయన ప్రకటించారు. అయితే ఆ దిగ్గజ సంస్థ ఏది? ఎక్కడ ఏర్పాటు చేశారు? ఎంత పెట్టుబడి వచ్చింది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఊహించగలరా? అంటూ లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణంగా ఇలాంటి భారీ అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ రకాల అనుమతులు సాధించడం, మౌలిక వసతుల కల్పన, యంత్రాల అమరిక వంటి పనులన్నింటికీ కనీసం 2 నుంచి 3 సంవత్సరాల సమయం పడుతుంది. కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక అనుమతులను అత్యంత వేగవంతం చేయడంతో, కేవలం 12 నెలల రికార్డు సమయంలోనే ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తయి ఉత్పత్తికి సిద్ధమైంది. భూమి పూజ చేసిన నాటి నుంచి ప్రాజెక్ట్ ప్రారంభం వరకు పట్టిన కాలాన్ని ప్రస్తావిస్తూ.. ఇదే నిజమైన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్లాంట్‌లో మొత్తం 10 ప్రొడక్షన్ లైన్లు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని వేలాది మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్లాంట్ పూర్తి స్థాయి వివరాలను ప్రస్తుతానికి సస్పెన్స్‌లో ఉంచడంతో, ఆ అంతర్జాతీయ బ్రాండ్ ఏమై ఉంటుందనే అంశంపై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ జరుగుతోంది. రాష్ట్రానికి వచ్చిన ఆ బహుళజాతి సంస్థ ఏంటనేది తెలుసుకోవడానికి ప్రజలు, పారిశ్రామిక వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో నేడు సాయంత్రం 5 గంటలకు మంత్రి నారా లోకేశ్ చేయనున్న అధికారిక ప్రకటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

వైఎస్ కుటుంబంలో ముదిరిన ఆస్తుల వివాదం - యలహంక ప్యాలెస్‌పై కోర్టుకెళ్లిన జగన్

మొదటి పేజి తరువాయి



వివాహ వేడుకల నిమిత్తం ఆ నివాసాన్ని ఉపయోగించుకోవాలని షర్మిల నిర్ణయించుకోగా, ఆమెను ఆ ఇంట్లోకి అడుగుపెట్టనివ్వకుండా నిరోధించేందుకు దేవనహళ్లి సీనియర్ సివిల్ జడ్జి అండ్ జేఎంఎఫ్‌సి కోర్టును జగన్ ఆశ్రయించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. కోర్టులో పిటిషన్ వేసిన జగన్ : ఈనెల 25న జరగనున్న తన కుమార్తె అంజిలి వివాహ వేడుకల్లో భాగంగా, కుటుంబ సంప్రదాయం ప్రకారం బెంగళూరులోని యలహంక నివాసంలోనే పెళ్లి కుమార్తెను చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని వైఎస్ షర్మిల నిర్ణయించుకున్నారు. ఇందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఆమె ఆదివారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లనున్నారు. షర్మిల బెంగళూరు పర్యటన, యలహంక నివాసంలో వేడుకల నిర్వహణ కోసం వస్తున్న విషయం జగన్ తెలుసుకున్నారు. యలహంక ఇంట్లోకి షర్మిలను కానీ, ఆమె తరపు వ్యక్తులను కానీ అనుమతించకుండా తక్షణమే స్టే జారీ చేయాలని కోరుతూ జగన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవనహళ్లి కోర్టులో సిలికాన్ బిల్డర్స్ పేరుతో భీమిశెట్టి రమేశ్‌బాబు పిటిషన్ వేశారు. జగన్ అభ్యంతరంతో ఇప్పటికే కుమార్తె అంజిలి వివాహ వేదికను షర్మిల హైదరాబాద్‌కు మార్చుకున్నారు. 20వ తేదీన పిటిషన్ దాఖలు చేసినప్పటికీ 21వ తేదీన పిటిషన్‌కు దేవనహళ్లి కోర్టులో నెంబరు ఇచ్చారు. విచారణకు ఏ బెంచ్ కు ఇంకా ఈ పిటిషన్‌ను కేటాయించలేదు. షర్మిలకు జగన్ లేఖ : షర్మిల తన కుమార్తె అంజిలి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లో చేయాలని నిర్ణయించుకుని ఆ వేదిక వివరాలతో ఆహ్వాన పత్రికలు ముద్రించి బంధుమిత్రులకు పంచగా అక్కడ పెళ్లి చేయడానికి వీల్లేదంటూ జగన్ అడ్డుపడిన సంగతి తెలిసిందే. 'నేను నివసిస్తున్న ప్రాంగణంలో పెళ్లి చేస్తే తీవ్ర భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయి. అందరిదృష్టి నా నివాసంపై పడుతుంది. ఇది నా ఇల్లు, ఇక్కడ నా కుటుంబం సురక్షితంగా ఉండేలా నేను చూసుకోవాలనుకుంటున్నాను' అంటూ షర్మిలకు జగన్ లేఖ రాశారు. ఇదిలా ఉండగా బెంగళూరులోని యలహంక భూమి తన కుమార్తె షర్మిలదేనని మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి విజయమ్మ గతంలోనే వెల్లడించారు. తన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి షర్మిలకు రాసిచ్చిన ఎంవోయూలోని ప్రతి ఆస్తితో పాటు సరస్వతి సిమెంట్ సహా ఎంవోయూలో లేని యలహంక భూమి కూడా షర్మిలదేనని ఆమె ఇదివరకే తేల్చిచెప్పేశారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి 20న 'క్లారిఫికేషన్' పేరిట ఆమె బహిరంగ ప్రకటన కూడా విడుదల చేశారు. అప్పట్లో న్యాయవాదితో నోటరీ చేయించి మరీ ఆమె ఈ ప్రకటన విడుదల చేశారు. కుమార్తె పెళ్లి పనుల కోసం యలహంక ప్యాలెస్‌లోకి వెళ్లేందుకు షర్మిల ఆదివారం బెంగళూరు వెళ్తున్న నేపథ్యంలో దేవనహళ్లి కోర్టు తీర్పుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కొత్తగూడెం వర్శిటీని ప్రపంచంలోనే టాప్-5లో నిలుపుతాం

మొదటి పేజి తరువాయి



ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సు ఏర్పాటు చేశారు. సింగరేణి, ఓయూ, కేయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును పూర్వ విద్యార్థులు - విద్యాసంస్థలు - పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి తుమ్మల ప్రసంగించారు. మైనింగ్ ఇంజనీరింగ్‌లో ఎంతో మంది నిపుణులు కొత్తగూడెం కాలేజ్ నుంచి వచ్చినవారే అని గుర్తుచేశారు. కొత్తగూడెంలో చదివిన పూర్వ విద్యార్థులు, విదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. విద్యారంగంలో తెలంగాణ ఖ్యాతి పెరిగేలా కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్శిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్శిటీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంతంలోనే ఈ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి చాలా ప్రోత్సహించారని.. అందుకే ఈ యూనివర్శిటీని ఖమ్మంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఖనిజాల కాణాచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని శాస్త్రీయంగా ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. మౌలిక సదుపాయాలు, ఆధునిక పరిశోధనల కోసం అత్యాధునిక ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోనే టాప్ ఫైవ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీల్లో కొత్తగూడెం యూనివర్శిటీని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే - ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది

మొదటి పేజి తరువాయి



ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈసారి అభ్యర్థులకు టికెట్లు కేటాయించామని తెలిపారు. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొత్తవారికి అవకాశమిచ్చామని చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో విద్యార్హతలు, ప్రవర్తన, పార్టీ పట్ల అంకితభావం, విధేయతకు ప్రాధాన్య మిచ్చామన్నారు. బీసీలు మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా వెన్నంటే ఉన్నారని కొనియాడారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సముచిత స్థానం కల్పించామని చెప్పారు. పల్నాడులో జడ్పీ ఛైర్మన్ అభ్యర్థి ఎంపికలోనూ సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో జనరల్ స్థానమైనప్పటికీ ఎస్సీ మహిళకు అవకాశం ఇచ్చి జడ్పీ ఛైర్మన్ పదవి కట్టబెట్టామని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కోట పుల్లమ్మ ఎంటెక్ చదివారని చంద్రబాబు వెల్లడించారు. 'ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, ఎన్నిక ఏదైనా విజయం కూటమిదే. స్థానిక సంస్థల్లో ప్రజా తీర్పుతో మాలో బాధ్యత పెరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తే, పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో 3.6 శాతం ఓట్లు పెరిగాయి. గొడ్డలి పార్టీ 39.8 నుంచి 6 శాతానికిపైగా ఓట్లు కోల్పోయింది. కూటమి అభ్యర్థుల సీట్ల సర్దుబాటుపై చాలా శ్రద్ధ పెట్టాం. అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేశాం. ఎన్నికల కోసం ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేశాం.' -చంద్రబాబు, ముఖ్యమంత్రి విద్యావంతులే : జిల్లా పరిషత్ పీఠాలపై మహిళలు, విద్యాధికులు, సామాన్య కార్యకర్తలకు పెద్దపీట వేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. 22 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకు కేటాయించామని తెలిపారు. వీరిలో 14 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారని వెల్లడించారు. 20 జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు అవకాశం ఇచ్చామన్నారు. వైస్ ఛైర్‌పర్సన్లలో 17 మంది ఉన్నత విద్యావంతులని వివరించారు. సామాన్య కార్యకర్తలను జడ్పీ ఛైర్‌పర్సన్లుగా నియమించామని తెలిపారు. అత్యుత్తమ యువ నాయకత్వం రావాలంటే విద్యాధికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. బూత్ కమిటీలు, క్లస్టర్లు, జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, సీనియర్ నేతలతో చర్చించిన తర్వాతే అభ్యర్థుల ఎంపికపై ప్రతిపాదనలు చేశామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇన్‌ఛార్జులు, నలుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. మిత్రపక్షాలతో సమన్వయం కోసం ఈ కమిటీలు పనిచేశాయని తెలిపారు. వారికిది మేలుకొలుపు : స్థానిక ఎన్నికల ఫలితాలు కొందరు ఎమ్మెల్యేలకు మేలుకొలుపు కావాలని చంద్రబాబు హెచ్చరించారు. ప్రతీ ఫలితాన్ని క్షుణ్ణంగా విశ్లేషించి అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. పంచాయతీఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలతో పోల్చితే పురపాలిక, పరిషత్ ఎన్నికల్లో కూటమికి ఆదరణ మరింత పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వైఎస్సార్సీపీ పరిస్థితి మరింతగా దిగజారుతోందని చెప్పారు. ఈ విజయాలను రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. బాధ్యత పెరిగింది : వైఎస్సార్సీపీ పన్నిన కుట్రలను ఛేదించి, ఆ పార్టీ డ్రామాలను నమ్మకుండా తీర్పునిచ్చిన ప్రజలకు చంద్రబాబు హ్యాట్సాఫ్ చెప్పారు. స్థానిక ఎన్నికల వేళ గొడ్డలి పార్టీ ఎన్నో విన్యాసాలు చేసిందని ధ్వజమెత్తారు. హింసకు పాల్పడింది వాళ్లే, ఫిర్యాదులు చేసింది వాళ్లేనని విమర్శించారు. ఈ నాటకాలను ప్రజలు విశ్వసించలేదని అందుకే వైఎస్సార్సీపీ ఆటలు సాగలేదని స్పష్టం చేశారు. అంతిమంగా స్థానిక ఎన్నికల్లోనూ ఆ పార్టీకి ప్రజల మద్దతు దక్కలేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించే శక్తిని ప్రజలు ఇచ్చారని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో తమపై బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఇప్పుడు మూడు స్థాయిల్లో ట్రిపుల్ ఇంజిన్ సర్కారుగా మారిందని అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యక్తిగత సంబంధాలు రాజకీయం రెండూ వేరు : పీసీపీ అధ్యక్షురాలు షర్మిల కుమార్తె వివాహానికి తనను ఆహ్వానిస్తే దాన్ని రాజకీయం చేస్తున్న వారిని ఏం అనాలని చంద్రబాబు ప్రశ్నించారు. రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేదా అని నిలదీశారు. వైఎస్ స

విద్యార్థులకు నిత్యవసరాలు, విద్యాసామగ్రి పంపిణీ



అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు 27రకాల నిత్యావసర వస్తువులతో పాటు కొన్ని విద్యాసామగ్రిని అందించారు. శనివారం ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసులు కుమారుడు వికాస్ పుట్టినరోజు సందర్భంగా అనంతపురంలోని హెచ్ఎల్సీ కెనాల్ సమీపంలో ఉన్న దయానంద గురుకులంలో ఉన్న విద్యార్థులకు నిత్యవసర వస్తువులను విద్యాసామగ్రిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉన్నత విలువలను తెలుసుకోవాలన్నారు. దయానంద గురుకులంలో ఉంటున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని విద్యలో రాణించాలని కోరారు. పెద్దలను గౌరవించాలని, పెద్దలు చెప్పిన అంశాలను తూచా తప్పకుండా పాటించాలని విద్యార్థులకు సూచించారు. నేటి విద్యార్థులుగా విలువలను తెలుసుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న సమయంలో తమ లాంటి పేద విద్యార్థులకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని చెప్పారు కార్యక్రమంలో ఆవాసం సెక్రటరీ జగదీష్, వార్డెన్ ప్రభాకర్, యోగా గురూజీ నాగరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు ఈవీఎంలన్నారు..

ఇప్పుడు బ్యాలెట్ దెబ్బ చూపించారు కదా

పంచాయతీ పోరులోనూ మనదే ఏకపక్ష విజయం ఎమ్మెల్యే పరిటాల సునీత, జడ్పీ ఛైర్మన్ పరిటాల శ్రీరామ్ ధీమా గ్రామాల అభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ చాలా అవసరం అసలైన బీసీల ద్రోహి వైసీపీనేనంటూ విమర్శలు



అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

2024ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధిస్తే ఈవీఎంలంటూ విమర్శలు చేశారని.. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా కూడా వైసీపీకి గట్టి దెబ్బ కొట్టారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తమ నివాసంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయాలు, రెండున్నరేళ్ల సుపరిపాలన, సామాజిక న్యాయం, గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి వివరించారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలు, ఇటీవల జరిగిన కార్పొరేషన్, మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బ్యాలెట్ల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారని అన్నారు. గత వైసీపీ హయాంలో రిగ్గింగ్‌లు, దాడులు, దౌర్జన్యాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. నేడు కూటమి ప్రభుత్వంలో అత్యంత ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని, 40ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు సైతం తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఏకపక్ష విజయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా కూటమికి అండగా నిలిచారని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ రాప్తాడులో ప్రతి పంచాయతీని క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని, అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ పరంగా 40 శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేశారు.

అనంతరం జడ్పీ చైర్మన్ శ్రీరామ్ మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రికార్డు స్థాయి మెజారిటీతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం, అలాగే ధర్మవరం నియోజకవర్గంలో నాలుగు ఎంపీపీ స్థానాలు కైవశం చేసుకోవడంతో పాటు ధర్మవరం రూరల్, బత్తలపల్లి మండలాల్లో సాధించిన జడ్పీటీసీ విజయాలు క్యాడర్ సమష్టి కృషికి నిదర్శనమన్నారు. పార్టీ అధిష్టానం, జిల్లా ప్రజా ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కలిసి పనిచేసే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ద్వారానే సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయికి చేరుతాయన్నారు. అలా ఉంటేనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు, సమాన అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 విధానం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఇటీవల సంభవించిన రెండు భారీ తుఫానులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వ యంత్రాంగం తుఫాను కంటే వేగంగా స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో తీవ్రత ఉన్నా సమర్థ సాగునీటి యాజమాన్యంతో రైతులను ఆదుకున్నామన్నారు. మేయర్లు, మున్సిల్ చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఇదే ఐక్యత, సమన్వయంతో పనిచేసి రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.

సీఎంగా చంద్రబాబు ఉంటేనే.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు

- టీడీపీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు

అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

హోలీ ఫైర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో జీవముగల దేవుని మందిరంలో సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. క్రైస్తవుల సంక్షేమం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టారన్నారు. పాస్టర్ లందరికీ డిసెంబర్లో గౌరవేతనం అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని స్వామిదాసు తెలిపారు. 2014-19 సంవత్సర కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుంటూరు విజయవాడ మధ్యన రెండు ఎకరాల స్థలం ఇచ్చి క్రిస్టియన్ భవనం కోసం 15 కోట్లు నిధులు కేటాయించరన్నారు. క్రిస్మస్ పండుగ రోజున క్రిస్మస్ హై టీ ప్రోగ్రాంకి గతంలో జగన్మోహన్‌రెడ్డి 30వేలు ఇచ్చే వారిని చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండు లక్షల రూపాయలు పెంచరన్నారు. దీన్నిబట్టి క్రైస్తవుల పట్ల ప్రేమ ఎవరికి ఉన్నదో అర్థమవుతుందన్నారు. క్రైస్తవుల కోసం పాస్టర్స్ కోసం ఈ బడ్జెట్‌లో 150 కోట్లు పెట్టడం జరిగిందన్నారు. ఈ నెలలో సబ్సిడీ లోన్స్ ఆన్లైన్ ప్రారంభమవుతాయని అన్నారు. క్రైస్తవులు జెరూసలేమి యాత్ర వెళ్లే వారికి 60వేల



రూపాయలు సబ్సిడీ ఇస్తుందని అన్నారు. చర్చి నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ క్రైస్తవులు, పాస్టర్స్ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈటె స్వామిదాసు కోరారు. కార్యక్రమం అనంతరం పాస్టర్స్ కు ఈటి స్వామి దాసు గిఫ్ట్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఫెడ్రిక్ బాబు, వయసు ప్రెసిడెంట్ తిమోతి, సెక్రటరీ జేమ్స్ రవి, జాయింట్ సెక్రెటరీ వెంకటరమణయ్య, ట్రెజరర్ వై భాస్కర్, ఈసీ మెంబర్లు ఎలీషా, శంకర్ రెడ్డి, ఎలిజిబెత్, విజయ్, కుమార్, మనోహర్,జోసెఫ్, ఫెలోషిప్ పాస్టర్స్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి

అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :



అనంతపురం నియోజకవర్గ పరిధిలోని మూడు గ్రామ పంచాయతీలకు ఈనెల 26వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారులు శనివారం గుర్తులను కేటాయించారు. ఇందులో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన రూరల్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి హరితకి క్యారెట్ గుర్తు, రుద్రంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి హరి ప్రసాద్‌కి బుట్ట గుర్తు, అలాగే రాజీవ్ కాలనీ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అవుకు హరికి మంచం గుర్తులను ఎన్నికల అధికారులు కేటాయించారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి పార్టీలు బలపరిచిన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయా పంచాయతీల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సమయం తక్కువగా ఉన్నందున కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ అత్యంత చురుగ్గా ప్రచార పర్వంలో పాల్గొనాలని సూచించారు. మూడు పంచాయతీలలోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను కచ్చితంగా గెలిపించుకోవాలని, ఇందుకోసం స్థానిక నేతలు సమన్వయంతో కష్టపడి పనిచేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ఆయా పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు తెలియజేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిశానిర్దేశం చేశారు.

గోళ్ళ గ్రామ పంచాయతీ అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు

గ్రామ అభివృద్ధికి భారీ నిధులు ప్రకటించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

హర్షం వ్యక్తం చేసిన జడ్పీటీసీ లక్ష్మి వెంకటేశులు,

మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మి రమేష్, టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు

కళ్యాణదుర్గం, నవంబర్ 21 (దరువు న్యూస్): కళ్యాణదుర్గం మండలం గోళ్ళ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భారీ నిధులు ప్రకటించారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు తన సొంత నిధుల నుంచి ఏకంగా రూ.1 కోటి 50 లక్షలు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అవసరమైన సదుపాయాల ఏర్పాటు, స్థానిక సమస్యల పరిష్కారం, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించనున్నారు. గోళ్ళ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి భారీగా నిధులు ప్రకటించడంపై జడ్పీటీసీ లక్ష్మి వెంకటేశులు, మార్కెట్ యార్డు



చైర్మన్ గోళ్ళ లక్ష్మి రమేష్, టీడీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి లక్ష్మి ప్రసన్న చంద్రనాయుడు, మాజీ సర్పంచ్ కవిత, బొజ్జన్నతో పాటు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి హామీలకే పరిమితం కాకుండా నిధుల కేటాయింపుతో గ్రామ ప్రగతికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గోళ్ళ గ్రామ అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధుల ప్రకటనతో గ్రామంలో నూతన అభివృద్ధి ఆశలు చిగురించాయి.

తిరుమల రూపేష్‌కు పీహెచ్‌డీ



అనంతపురం, నవంబర్ 21 దరువు న్యూస్ : బాలాజీ ఫార్మసీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుమల రూపేష్ అక్టోబర్ 15న తమ పరిశోధన అంశ మౌఖిక మూల్యాంకనాన్ని (పీహెచ్డీ వైవా) విజయవంతంగా ముగించుకొని డాక్టరేట్ డిగ్రీ పట్టాకు అర్హత పొందారని జేఎన్టీయూఏ ఓటిపిఆరఐ సంస్థ సంచాలకులు సీనియర్ ఆచార్య జివి సుబ్బారెడ్డి తెలిపారు. "సింథసిస్, క్యారెక్టరైజేషన్, ఇన్ సిలికో అండ్ ఇన్ విట్రో స్టడీస్ ఆఫ్ నోవెల్ బెంజోథియజోల్ డెరివేటివ్స్ ఫోర్ యాంటీ ట్యూబర్కులర్ యాక్టివిటీ" అనే అంశం మీద బాలాజీ ఫార్మసీ కళాశాలలో సీనియర్ కెమిస్ట్రీ ఆచార్యులు ఆచార్య వీ.గీతావాణి పర్యవేక్షణలో పరిశోధనలు నిర్వహించి పరిశోధన గ్రంథాన్ని, వ్యాసాలను ప్రచురించారని తెలిపారు. ఈ మౌఖిక మూల్యాంకనానికి ఇండియన్ ఫార్మాకోపీయా కమిషన్ ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ (ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ) డా.కలైవాణి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థిని తిరుమల రూపేష్ తమ పిహెచ్డి పరిశోధన విజయవంతం కావడానికి విశేషంగా సహకరించిన జేఎన్టీయూఏ విశ్వవిద్యాలయ అధికారులు, కళాశాల మేనేజ్మెంట్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జి.తిరుమల రూపేష్‌కు ఓటిపిఆరఐ సంస్థ సంచాలకులు ఆచార్య జీ.వీ సుబ్బారెడ్డి, కళాశాల మేనేజిమెంట్, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్ కుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

డాక్టర్ తేజ వారి ఆధ్వర్యంలో పాతకోట యూపి హెచ్ సి ల్యాబ్ పరిశీలించడం జరిగింది



యాడికి దరువు న్యూస్ ప్రతినిధి నవంబర్ (21) : జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మనోజ్ గారి ఆదేశాల మేరకు పాతకోట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాతకోట యూపి హెచ్ సి నందు ల్యాబ్ ను పరిశీలించడం జరిగింది ల్యాబ్ లోని రికార్డులు డైరీ ఎంఎస్ టు ఎన్ ఎఫ్ సెవెన్ ఎం ఎఫ్ 8 ఏం ఎఫ్ నైన్ మొదలగు రికార్డ్ లను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ మధుబాబుకు అన్ని రికార్డులను సక్రమంగా రాయవలెనని తెలియజేయడం జరిగింది అలాగే వార్డు నందు ఎంపీ హెచ్ఏ మేల్ ఎంపీహెచ్ఎఫ్ ఫిమేల్ మరియు సచివాలయం ఏఎన్ఎం తీసిన రక్త పూతలను తప్పక పరీక్షించవలెనని తెలియజేయడం జరిగింది పాతకోట యు పి హెచ్ సి కి జ్వరము అని వచ్చిన ప్రతి ఒక్కరికి డెంగ్యూ మలేరియా చికెన్ గునియా టైఫాయిడ్ కామెర్లకు రక్త పరీక్షలు చేయవలెనని తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ల్యాబ్ టెక్నీషియన్ మధుబాబు మొదలగు వారు పాల్గొన్నారు

అనంతలక్ష్మీ కళాశాల విద్యార్థి జేఎన్టీయూఏ ఇంటర్ యునివర్సిటీ చెస్ క్రీడా జట్టుకు ఎంపిక

అనంతపురం, నవంబర్ 21 దరువు న్యూస్ : అనంతలక్ష్మి కళాశాలలో బిటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అవారి ఉదయకుమార్ తిరుపతిలోని శ్రీ రామ ఇంజనీరింగ్ కళాశాల లో జరిగిన జేఎన్టీయూఏ అనంతపురం కళాశాలల పురుషుల చెస్ చాంపియన్ షిప్ లో సౌత్ జోన్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుటాల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థిని అభినందిస్తూ, జేఎన్టీయూఏ అనంతపురం ఇంటర్ యునివర్సిటీ చెస్ పోటీలలో ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ జట్టుకు ఎంపిక కావడం కళాశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడల్లో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా అద్భుతమైన ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల చైర్మన్ అనంతరాముడు, ప్రిన్సిపల్ డాక్టర్ కుటాల శ్రీనివాసులు, ప్రాంగణ నియామకాల, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున, బి.ధనలక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు.

పోలీసులు, ఎన్నికల యంత్రాంగం అండతో

కూటమి అరాచకాలు



- స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ
- వైఎస్సార్‌సీపీ నాయకులు ఫైర్
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు
- నామినేషన్ల అడ్డగింత, రిగ్గింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఫలితాల తారుమారు
- తాడిపత్రిలో పెట్రోల్ బాంబుల దాడులు.. బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు
- శింగనమలలో మహిళలు, పిల్లలపై దాడులు.. సమయానికి ముందే ఎన్నిక ముగింపు
- కళ్యాణదుర్గంలో డీఎస్పీ సమక్షంలోనే 38 ఎంపీటీసీ, 4 జెడ్పీటీసీ ఫలితాల మార్పు
- గుంతకల్లులో ఏకగ్రీవాల పేరుతో రూ.లక్షల్లో ప్రలోభాలు, గంజాయి బ్యాచ్‌లతో బెదిరింపులు

పోలీసులు, ఎన్నికల యంత్రాంగం అండతో ప్రజాస్వామ్యం ఖూనీ

జిల్లా వైసీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు ఒక పక్షానికి వత్తాసు పలుకుతున్నారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నుంచి ప్రస్తుత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, రిగ్గింగ్‌కు పాల్పడటం, పోలింగ్ బూత్‌లను తమ ఆధీనంలోకి తీసుకోవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. కౌంటింగ్‌లోనూ గెలిచిన వారిని ఓడినట్లు, ఓడిన వారిని గెలిచినట్లు ప్రకటిస్తూ ఫలితాలను తారుమారు చేస్తున్నారు. ముఖ్యంగా కళ్యాణదుర్గం, శింగనమల, తాడిపత్రిలో పోలీసుల వ్యవహారశైలి వల్ల పరిస్థితులు అదుపుతప్పుతున్నాయి. తాడిపత్రిలో పెట్రోల్ బాంబులతో వాహనాలు, ఇళ్లపై దాడులు చేసినా పోలీసులు పట్టించుకోలేదు, బాధితులకే రక్షణ కల్పించలేని పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకులపై హౌస్ అరెస్టులు, నియోజకవర్గ బహిష్కరణలు విధిస్తూ దాడులకు పాల్పడుతున్న కూటమి నాయకులపై చర్యలు తీసుకోవడం లేదు. 26 నుంచి జరిగే సర్పంచ్ ఎన్నికలనైనా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి. పోలీసుల ఏకపక్ష వైఖరికి అడ్డుకట్ట వేసి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీసులను అడ్డుపెట్టుకొని టిడిపి నాయకులు శిఖండి రాజకీయాలు చేస్తున్నారు.

అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో అధికార కూటమి నాయకులు, పోలీసు, ఎన్నికల యంత్రాంగం అండతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, సమన్వయకర్తలు సాకె శైలజానాథ్, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తలారి రంగయ్య, వై.వెంకట్రామిరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయడంతోపాటు రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీని కలిసిన అనంతరం వారు అక్కడే మీడియాతో మాట్లాడారు. నామినేషన్లు వేయకుండా అభ్యర్థులను అడ్డుకోవడం, రిగ్గింగ్ చేయడం, కౌంటింగ్ కేంద్రాల్లో డీఎస్పీ, సీఐల సమక్షంలోనే గెలిచిన వారిని ఓడినట్లు ప్రకటించి ఫలితాలను తారుమారు చేయడం వంటి అక్రమాలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయని వారు ఆరోపించారు. తాడిపత్రిలో పట్టపగలే పెట్రోల్ బాంబులతో దాడులు చేసి వాహనాలు, ఇళ్లను తగలబెట్టినా పోలీసులు పట్టించుకోకపోగా, బాధితులపైనే అక్రమ కేసులు, హౌస్ అరెస్టులు విధిస్తున్నారని మండిపడ్డారు. శింగనమల ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా మహిళలు, పిల్లలపై దాడులు చేయడమే కాకుండా, మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన ఎన్నికను 1.20 గంటలకే ముగించి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించారు. కళ్యాణదుర్గంలో ప్రైవేట్ బౌన్సర్ల సాయంతో, గుంతకల్లులో రూ.20లక్షల నుంచి రూ.30లక్షల ప్రలోభాలు, గంజాయి బ్యాచ్‌ల బెదిరింపులతో ఎన్నికలను వ్యాపారంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ పోలీసు అధికారులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని, ఎన్నికల అక్రమాలను బయటపెట్టకుండా మీడియాను అడ్డుకోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని స్పష్టం చేశారు. వ్యవస్థలన్నీ పూర్తిగా విఫలమయ్యాయని, అందువల్ల పోలింగ్ నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రజలే స్వయంగా కేంద్రాల వద్ద కాపలా ఉండి తమ ఓటు హక్కును రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 26 నుంచి జరగబోయే సర్పంచ్ ఎన్నికలనైనా నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కలిసి డిమాండ్ చేశారు.

పెట్రోల్ బాంబులతో దాడులు.. కౌంటింగ్ కేంద్రాల్లో ఫలితాల తారుమారు

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



అధికారంలో ఉన్నవారికి చట్టం చుట్టంగా మారింది, ప్రజాస్వామ్యం అపహాస్యంగా నిలిచిపోయింది. తాడిపత్రిలో గత రెండున్నరేళ్లుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు తెచ్చుకున్నా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని స్వేచ్ఛగా బయట తిరగలేని పరిస్థితి కల్పించారు. మొన్నటి ఎన్నికల్లో ఏజెంట్లను, అభ్యర్థులను బయటకు పంపించి పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ప్రజాతీర్పును ఎదుర్కొనే ధైర్యం కూటమి నాయకులకు లేదు. పట్టపగలే పెట్రోల్ బాంబులతో దాడులు చేసి నాలుగు వాహనాలు, 15 ద్విచక్ర వాహనాలను తగలబెట్టారు, ఇళ్లపైకి వచ్చి దాడులు చేశారు. ఇలాంటి ఘటనల్లో బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తున్నారు. శింగనమలలోనూ ఎన్నికల ప్రక్రియను అడ్డుకుని, కౌంటింగ్ కేంద్రాల్లో ఫలితాలను మార్చారు. 11 ఎంపీటీసీ, ఎనిమిది కౌన్సిలర్ స్థానాల్లో ఫలితాలను తారుమారు చేశారు. 16 చోట్ల రీకౌంటింగ్ కోరాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు, బదిలీల పేరుతో ఒత్తిళ్లు తీసుకొస్తూ అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు పనిచేయించుకుంటున్నారు. పెట్రోల్ బాంబులతో దాడులు జరిగినా టపాసుల వల్ల మంటలు అంటుకున్నాయని చెప్పడం పోలీసుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. వైఎస్సార్‌సీపీ నాయకులకే హౌస్ అరెస్టులు, ఆంక్షలు విధిస్తూ కూటమి నాయకులకు స్వేచ్ఛనిస్తున్నారు. పోలీసు వ్యవస్థ సహకారంతోనే ఈ అరాచకాలు జరుగుతున్నాయని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా స్పందించి ఎన్నికల హింసను అరికట్టాలి, లేదంటే ఏదో ఒక రోజు ప్రజలే స్పందించే పరిస్థితి వస్తుంది.

మహిళలు, పిల్లలపై దాడులు.. పోలీసు వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం

మాజీ మంత్రి సాకె శైలజానాథ్



జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో కూటమి నాయకులు దుర్మార్గపు, దౌర్జన్యపూరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. కొంతమంది పోలీసు అధికారులు ప్రజ లకు రక్షణ కల్పించాల్సింది పోయి పంచాయతీలు చేయడం, కొట్టడం, కేసులు పెడ తామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. శింగనమల ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా మహిళలు, పిల్లలను కొట్టారు, పోలీసులే వారిని నెట్టివేశారు. ఎన్నికల అధికారులు కూడా ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన ఎన్నికను 1.20 గంటలకే ముగించేశారు. ఇళ్లపై దాడులు చేయడం, వాహనాలను తగల బెట్టడం, ఇళ్లను ధ్వంసం చేయడం ఏమిటి? రాజేపల్లిలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులను, వారి కుటుంబ సభ్యులను బెదిరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు, లేఖలు పంపినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శోధనపల్లి ఎంపీటీసీ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి గెలిచామని టీడీపీ నాయకులే బహిరంగంగా చెప్పుకున్నారు. ఇది పూర్తిగా వ్యవస్థ వైఫల్యం. ఇప్పటికైనా పోలీసులు బాధ్యతగా వ్యవహరించి అక్రత్యాలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేయాలి. ప్రజల సహనాన్ని పరీక్షించవద్దు.

కళ్యాణదుర్గంలో డీఎస్పీ సమక్షంలోనే ఫలితాల తారుమారు : మాజీ ఎంపీ తలారి రంగయ్య



పోలీసు, ఎన్నికల వ్యవస్థలు పూర్తిగా విఫలమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ముందునుంచే పోలీసుల నుంచి ప్రజలను రక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల అధికారుల నుంచే ఎన్నికలను కాపాడాలని గతంలోనూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కళ్యాణదుర్గంలో నామినేషన్ల సమయంలో అభ్యర్థులను అడ్డుకోవడం, రిగ్గింగ్‌కు పాల్పడటం వంటి అక్రమాలు జరిగాయి. కౌంటింగ్ కేంద్రాల్లోనే ఫలితాలను మార్చేయడం అత్యంత దారుణం. కళ్యాణదుర్గంలో నాలుగు జెడ్పీటీసీ, దాదాపు 38 ఎంపీటీసీ స్థానాల ఫలితాలను డీఎస్పీ, సీఐల సమక్షంలోనే తారుమారు చేశారు. వ్యవస్థలు విఫలమైతే ప్రజలకు పోలీసు, ఎన్నికల, ఇతర ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం పోతుంది. కనీసం ఈసారైనా సర్పంచ్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి. ఎలాంటి గొడవల్లో సంబంధం లేని వారిని కేసుల్లో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రజలు వేసిన ఓట్లను పోలింగ్ నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఎన్నికల అధికారులు, పోలీసులపై నమ్మకం లేకుండా ప్రజలే పోలింగ్ కేంద్రాల వద్ద ఉండి తమ ఓట్లను రక్షించుకోవాల్సి వస్తోంది. ప్రజాస్వామ్యంలో వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఎన్నికలను వ్యాపారంగా మార్చిన కూటమి నేతలు

మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి



రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నాయకులు హింస, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడుతున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తిలో అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారి భార్యలు, పిల్లలను సైతం బెదిరించే స్థాయికి దిగజారారు. కష్టపడి దాఖలు చేసిన 19 నామినేషన్లలో 12 తిరస్కరించారు, మిగిలిన ఏడుగురిని కూడా రాత్రివేళ బెదిరించి ముగ్గురిని మాత్రమే పోటీలో ఉంచారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ అధికారులే నామినేషన్ పత్రాలను చించివేసే పరిస్థితి చూశాం. కోర్టు ఆదేశాలు తెచ్చుకున్నా వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే తనయుడి పేరుతో ఏకగ్రీవ ఎన్నికలకు ప్రలోభాలు పెడుతూ గ్రామాలకు రూ.20లక్షలు, రూ.30లక్షలు ఇస్తామని చెబుతున్నారు. పామిడి పట్టణంలో సర్పంచ్ నామినేషన్లు వేయగలిగినా వార్డు సభ్యుల నామినేషన్లను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అభ్యర్థులను బాంబులతో బెదిరిస్తూ గంజాయి బ్యాచ్‌లతో దాడులు చేయిస్తున్నారు. ఎన్నికల్లో ప్రతిఘటించే వారిపైనే కేసులు నమోదు చేసి భయపెడుతున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల పేరుతో రూ.15 నుంచి రూ.16 కోట్ల వరకు వసూళు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై ఎస్పీ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఎన్నికల అక్రమాలను చిత్రీకరించకుండా మీడియాను అడ్డుకోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. కనీసం రాబోయే ఎన్నికలైనా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రాయలసీమ తైక్వాండో పోటీలకు

ఆదర్శ విద్యా నికేతన్ విద్యార్థుల ఎంపిక



పెద్దవడుగూరు, నవంబర్ 21, దరువు న్యూస్ :

రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీలకు పెద్దవడుగూరులోని ఆదర్శ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. తైక్వాండో కోచ్ తలారి తులసీ రామ్ వద్ద శిక్షణ పొందిన ఈ విద్యార్థులు రాబోయే పోటీలలో తమ ప్రతిభను చాట నున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ కరణం నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కరణం మాధురి లహరి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ తలారి తులసీరామ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాయలసీమ తైక్వాండో పోటీలకు

నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల ఎంపిక



గార్లదిన్నె, నవంబర్ 21, దరువు న్యూస్ :

రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీలకు గార్లదిన్నె మండల పరిధిలోని పెనకచెర్ల డ్యామ్‌లోని నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్, బెస్ట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఈ విద్యార్థులు రాబోయే పోటీలలో తమ ప్రతిభను చాట నున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను స్కూల్ చైర్మన్ డాక్టర్ డి.హైదర్ వలి, ప్రిన్సిపాల్ యాస్మిన్ నేహార్, డైరెక్టర్ జిలాన్, బెస్ట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ షేక్ యూనిస్, వైవి కన్‌స్ట్రక్షన్స్ అధినేత షేక్ ఫైజన్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాయక్ ఖలీల్, తాజుద్దీన్, తైక్వాండో కోచ్ తలారి తులసిరామ్‌లు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

భాష్యంలో అట్టహాసంగా కల్చరల్ డే వేడుకలు





అనంతపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో కల్చరల్ డే వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, అనంతపురం జిల్లా జెడ్ఈఓ రవివర్మ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, హెచ్ఎం రెహనా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రవివర్మ మాట్లాడుతూ.. విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే భాష్యం విద్యాసంస్థల ప్రధాన ఆశయమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించాలని, దేశం పట్ల గౌరవం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో మార్కులు, ర్యాంకులు మాత్రమే ముఖ్యమైనవి కావని, వాటికి మించి నిజమైన జ్ఞానాన్ని, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే విద్యార్థులు కలలు కనడానికి భయపడకుండా, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని సాకారం చేసుకోవడానికి పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ బాల కృష్ణ మాట్లాడుతూ.. భాష్యం విద్యాసంస్థలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఒక గొప్ప ఎంపిక అని అన్నారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, పట్టుదల, క్రమ శిక్షణతో ఆ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, అంతర్గత ప్రతిభను వెలికితీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఆటపాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో నూతన ఉత్సాహాన్ని, ఆత్మ విశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా వివిధ ఆటపాటలు, పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథులు, పాఠశాల యాజమాన్యం చేతుల మీదుగా మెడల్స్ అందజేసి అభినందించారు. దీంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం, ఆనందం నెలకొన్నాయి. పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, హెచ్ఎం రెహనా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సమిష్టి కృషి, సమన్వయంతో కల్చరల్ డే వేడుకలు ఎంతో విజయవంతంగా, ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.


నిడగల్లు శ్రీ యోగా లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, నవంబర్ 21, దరువు న్యూస్ :

అతి పురాతనమైన నిడగల్లు క్షేత్రం కొండలో వేలసిన శ్రీ యోగా లక్ష్మీనరసింహ స్వామి వారికి కార్తీక మాసం సందర్భంగా రెండవ శనివారం విశేష ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్థానం అర్చకులు హరీష్ బట్టర్ తెలిపారు. ఉదయం స్వామి వారికి వివిధ అభిషేకములు, పంచామృత అభిషేకం, తైలాభిషేకం జరిపి, ప్రత్యేక అలంకరణ చేసి, స్వామి వార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో కూర్చుండబెట్టి పూజలు జరిపి భక్తులు భక్తి శ్రద్ధలతో పల్లకితో ప్రాకారోత్సవం నిర్వహించి భక్తులు తమ మొక్కుబడి తీర్చుకున్నారు.

దేవస్థానశీ అర్చకులు హరీష్ బట్టర్

స్వామి వారి ఉత్సవ మూర్తులతో గర్భగుడి చుట్టూ ప్రదిక్షణలు చేస్తే భక్తులు కోరిన కోర్కెలను స్వామి వారు తప్పకుండ తీరుస్తారన్న భక్తుల అపార నమ్మకం. ప్రాకారోత్సవం అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించి మహామంగళ హారతి తీర్థ ప్రసాదం వితరణ చేసారు. దేవాలయం అభివృద్ధి కమిటి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న దానోహం నిర్వహించారు. కార్యక్రమంలో కర్నాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాలకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.